సాక్షి కర్నూలు

శనివారం । 15 । మార్చి । 2025



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా శుక్రవారం ఆలయ నిత్య కళా వేదికపై నృత్య ప్రదర్శన చేశారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కళాకారులు చేసిన నృత్యాలు అలరించాయి.



రమణీయం.. రథోత్సవం

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్రంలో శ్రీ ప్రహ్లాదవరదుడు ఉభయ దేవరులతో కలసి రథంపై భక్తులకు అభయమిచ్చారు. శుక్రవారం రథంలో అధిష్టించి క్షేత్ర తిరువీధుల్లో విహరించారు.

ఉష్ణోగ్రతలు


కనిష్టం	25.6
గరిష్టం	41.2

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:33	ఉ॥ 5:04
ఆదోని	సా॥ 6:32	ఉ॥ 5:04
నంద్యాల	సా॥ 6:30	ఉ॥ 5:04
ఆత్మకూరు	సా॥ 6:28	ఉ॥ 4:59
బనగానపల్లె	సా॥ 6:32	ఉ॥ 5:02

హదీస్ వెలుగు :

డబ్బు ఇచ్చి వడ్డీ తీసుకోవడం మహా పాపం. ఈ హరామ్ సొమ్ముతో ఏ శుభకార్యం చేసినా అల్లాహ్ అంగీకరించరు. వడ్డీ లావాదేవీల నుంచి దూరంగా ఉండండి. – పవిత్ర ఖురాన్



ఆధునిక ప్రపంచంలో ప్రతీది కల్తీయే. ఉదయం లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకు వినియోగించే ప్రతి వస్తువులోనూ నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. స్వచ్ఛమైన పాలు తాగుతున్నామో లేదో తెలియదు.. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వినియోగిస్తున్న మందులు సరైనవో కాదో అర్థం కాదు.. పిల్లల పెళ్లిళ్లు, భవిష్యత్ పొదుపును దృష్టిలో ఉంచుకొని కొనుగోలు చేస్తున్న బంగారంలో నాణ్యత తిరిగి అమ్మినప్పుడు తప్ప బయటపడని పరిస్థితి. కనీసం కూరగాయలైనా సరైన తూకంలో లభిస్తున్నాయా అంటే అక్కడ మోసమే. ఇక ఉచిత సేవలైనా సక్రమంగా అందిస్తున్నారంటే వీటికి ముక్కుపిండి డబ్బు వసూలు చేస్తున్నారు. అవగాహన లోపంతో అడుగడుగునా వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు. ప్రశ్నించేతత్వం లేనంత వరకు ఈ మోసం కొనసాగుతుందనడంలో సందేహం లేదు. ఇప్పటికైనా మేల్కొందాం.. తప్పును నిలదీద్దాం.. మోసాన్ని వేలెత్తి చూపుదాం.. నష్టాన్ని న్యాయంగా తీరిగి పొందుదాం.

నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం. – కర్నూలు(సెంట్రల్)

మోసాలను ప్రశ్నిద్దాం..
'న్యాయం'గా ఎదుర్కొందాం!

ఫిర్యాదు చేయాల్సిన టోల్‌ఫ్రీ నెంబర్లు

1967, 1915 : పౌరసరఫరాల శాఖ

1800114000 లేదా 1915: వినియోగదారుల ఫోరం

➤ కర్నూలుకు చెందిన పాలిమెర మధుకుమార్ రూ.50లక్షలకు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో స్మార్ట్ స్వధాన్ ప్లస్‌పాలసీ తీసుకున్నారు. ఆయన మరణించడంతో భార్య శైలజ బీమా క్లెయిమ్ చేసుకోవడానికి వెళితే గుండె జబ్బు ఉన్నట్లు ముందుగానే మధుకుమార్ చెప్పలేదని, అందువల్ల క్లెయిమ్‌ను తిరస్కరిస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీంతో ఆమె జిల్లా వినియోగదారుల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించింది. ఉద్దేశపూర్వకంగా కంపెనీయే పూర్తి నిబంధనలను తెలపడంలో విఫలమైందని, 9 శాతం వడ్డీతో శైలజకు రూ.50 లక్షలను చెల్లించాలని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పు ఇచ్చింది.

➤ పత్తికొండకు చెందిన ముగ్గురు రైతులకు స్థానిక శ్రీవెంకటేశ్వర ట్రేడర్స్ నకిలీ విత్తనాలను విక్రయించింది. అయితే అవి కనీసం మొలక కూడా ఎత్తలేదు. దీంతో బాధిత రైతులు జిల్లా వినియోగదారుల వివాదాల కమిషన్‌ను ఆశ్రయించారు. నకిలీ విత్తనాలు అమ్మిన ట్రేడర్స్‌కు రూ.70 వేలు చెల్లించాలని కమిషన్ 2024 జూన్ 21న ఆదేశాలు ఇచ్చింది. ఆ ట్రేడర్స్ యాజమాని డి.గంగాధర్ కమిషన్ ఆదేశాలను లెక్కచేయకపోవడంతో నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేయడం గమనార్హం.

రైతుబజారు తూకాల్లో మోసం



కర్నూలులోని సి.క్యాంపు రైతుబజారులో శుక్రవారం కూరగాయలు కొనుగోలు చేశాం. కిలో రూ.36 చొప్పున బెండకాయలు కొని బయట తూకం వేయిస్తే 920 గ్రాములు మాత్రమే తూగింది. 80 గ్రాములు నష్టపోయాం. అదే విధంగా పచ్చిమిరప కిలో కొని తూకం వేయిస్తే 945 గ్రాములే చూపించింది. ఇందులోనూ 55 గ్రామలు దగా చేశారు. బీట్ రూట్ ధర బోర్డులో కిలో రూ.20 అని రాసినా, వ్యాపారులు కిలో రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. – అలివేలమ్మ, శరీన్‌నగర్, కర్నూలు

నేటి సమాజంలో ఎక్కడ చూసినా మోసాలు, నాణ్యతలేని వస్తువుల విక్రయాలు అధికమయ్యాయి. దీంతో వాటిని నమ్మి కొనుగోలు చేసిన వారు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. అయితే వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందాలంటే కొనుగోలు చేసిన డబ్బుకు సంబంధించి బిల్లును కచ్చితంగా తీసుకోవాలి. ఆ బిల్లు ఆధారంగానే కేసు వేస్తే జరిగిన అన్యాయానికి న్యాయం జరుగుతుంది. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుంది.

8800001915
వాట్సాప్‌లోనూ ఫిర్యాదు

ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులను విక్రయించినా, నాసిరకం ఉత్పత్తులను అంటగట్టినా మీ ఇంటి నుంచే వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ ఇందుకోసం వాట్సాప్(8800001915) చాట్‌బోట్ సేవలను తీసుకొచ్చింది. ఈ నంబర్ సేవ్ చేసుకొని హాయ్ అని టైప్ చేస్తే జాతీయ వినియోగదారుల కమిషన్ హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు నమోదవుతుంది.

ఇది కల్తీ ప్రపంచం

- నాణ్యతా లోపాలపై అవగాహన తప్పనిసరి
- బిల్లు తీసుకుంటేనే రక్షణ
- నేరుగా లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదుకు అవకాశం
- రూ.5లక్షల్లోపు కేసులకు ఫీజు లేకుండానే న్యాయం

బంగారం అమ్మకాల్లో దగా..

- 91.6 స్వచ్ఛత కలిగిన బంగారం ఆభరణాలు కొంటే తిరిగి అమ్ముకున్నప్పుడు ఆ రోజు ఉన్న ధర లభిస్తుంది.
- 24 క్యారెట్ బంగారం బిస్కెట్ రూపంలో లభిస్తుంది. ఇది పూర్తిగా స్వచ్ఛమైనది.
- నగలు, ఆభరణాలు మాత్రమే 22 క్యారెట్లలో ఉంటాయి. వీటి స్వచ్ఛత 916.
- స్వచ్ఛమైన బంగారానికి సాధారణంగా హాల్ మార్క్ ఉంటుంది.
- 80 శాతం షాపుల్లో హాల్ మార్క్ లేని ఆభరణాలనే అమ్ముతున్నట్లు తెలుస్తోంది.
- 14, 16, 18, 20 క్యారెట్ల బంగారం ఆభరణాలు అమ్ముతూ వాటికి 22 క్యారెట్ల ధర వసూలు చేస్తుండటం గమనార్హం.



బంగారం తూకాల్లో తేడాలపై కేసులు

సంవత్సరం	కేసులు	జరిమానా
2023-24	13	రూ.1.51లక్షలు
2024-25	37	రూ.1.95లక్షలు



జిల్లా వినియోగదారుల వివాదాల కమిషన్ కార్యాలయం

కనిపించని ఎలక్ట్రానిక్ కాటాలు

కర్నూలులో మూడు, ఆదోని, ఎమ్మిగనూరుల్లో ఒక్కొక్కటి ప్రకారం రైతుబజార్లు ఉన్నాయి. వీటిల్లో 80 శాతం మంది దళారీలు తిష్టవేయడం వల్ల వినియోగదారులను దగా చేస్తున్నారు. కూరగాయలను బోర్డుపై రాసిన ధరలకే విక్రయించాలని, తూకాల్లో కచ్చితత్వం ఉండాలని మైకుల్లో చెప్పడమే కానీ అధికారులు తనిఖీలు చేయని పరిస్థితి. బోర్డుపై ధరలను పొందుపర్చడమే కానీ ఆ ధరతో విక్రయిస్తున్న దాఖలాల్లేవు. ఇక ఎలక్ట్రానిక్ కాటాలు వినియోగించకపోవడంతో తూకాల్లో మోసం నిత్యకృత్యమైంది.

ఆహార కల్తీపై కేసులు

సంవత్సరం : 2024-25	
సేకరించిన శాంపిల్స్ : 510	
కల్తీ నిర్ధారణ : 38	కేసులు : 9
జరిమానా : రూ.2.10లక్షలు	

కల్తీలపై ఫిర్యాదుకు..

కర్నూలు నగరంలోని సి.క్యాంప్ సెంటర్‌లోని ఆహార భద్రత కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేయాలి.

ఇంకెప్పుడు మేల్కొంటారో!

అయితే అధికారులకు తీరిక లేకనో అవగాహనపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. పాఠశాలల్లో వినియోగదారుల ఫోరంలు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ మేరకు ప్రతి పాఠశాలలో విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

అండగా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్

వస్తు సేవల్లో నాణ్యత లోపించినా.. కల్తీ ఆహార పదార్థాలను విక్రయించినా.. బీమా, బ్యాంకులు మోసానికి పాల్పడినా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అండగా ఉంటుంది. జిల్లా స్థాయిలో రూ.5 లక్షల వరకు మోసాలకు ఎలాంటి కోర్టు ఫీజు చెల్లించకుండానే వినియోగదారుడు తగిన పరిహారం పొందవచ్చు. న్యాయవాది అవసరం లేకుండానే పోరాటం చేయవచ్చు. రూ.5 లక్షల పైన వివాదాలకు కోర్టు ఫీజులతో పాటు న్యాయవాదులను నియమించుకునే అవకాశం ఉంది. జిల్లా కమిషన్ గత మూడేళ్లలో 635 కేసులను పరిష్కరించగా.. రూ.15 కోట్లను పరిహారంగా వినియోగదారులకు అందించింది. ప్రస్తుతం 119 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

నిర్భయంగా ఫిర్యాదు చేయాలి



వినియోగదారుల హక్కులు కాపాడడం మా ప్రథమ కర్తవ్యం. మోసపోయిన వారు కమిషన్‌ను ఆశ్రయిస్తే తగిన న్యాయం చేస్తాం. రూ.5 లక్షల వరకు ఎలాంటి ఫీజు ఉండదు. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు తీసుకుంటాం. మార్టులు, మాల్స్‌లో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి కమిషన్ సిద్ధంగా ఉంటుంది.
– కరణం కిశోర్, చైర్మన్, వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్



సినిమా హాల్లోకి బయటి ఆహార పదార్థాలను తీసుకెళ్లరాదని బోర్డు పెట్టిన దృశ్యం

అవగాహన కల్పించేందుకు చర్యలు



మార్కెట్‌లో వినియోగదారులు ఏ వస్తువు కొనుగోలు చేసినా బిల్లు తీసుకోవాలి. లేదంటే మోసపోయినట్లే. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. కాలేజీలు, స్కూలు విద్యార్థుల్లో అవగాహనకు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా నే వ్యాసరచన, వక్తత్వ పోటీలను నిర్వహిస్తున్నాం. – ఎం.రాజారఘువీర్, డీఎస్‌ఓ

విద్యార్థి దశ నుంచే ప్రశ్నించేతత్వం



ప్రతి పాఠశాల, కాలేజీలో వివినియోగదారుల ఫోరం క్లబ్‌లను ఏర్పాటు చేయాలి. వీటి ద్వారా విద్యార్థుల్లో చిన్నతనం నుంచే క్రయ, విక్రయాలకు సంబంధించిన బిల్లులు, వాటి విలువ, ఎమ్మార్పీ, ఇతర అంశాలపై అవగాహన కల్పించాలి. అప్పుడే ప్రశ్నించే తత్వం అలవడుతుంది. ఒక్క రూపాయే మోసం జరిగినా వదలకూడదు.
– నదీమ్, వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

నేటి నుంచి ఒంటిపూట బడులు

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు నేటి(శనివారం)నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేయాలని తెలిపారు. పాఠశాల సమయం ముగిసిన తరువాత విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు.

28న డాక్ అదాలత్



జనార్దన్‌రెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్

కర్నూలు(అర్బన్): డాక్ అదాలత్ కార్యక్రమాన్ని ఈ నెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు కర్నూలు డివిజన్ పోస్ట్ ఆఫీసెస్ సూపరింటెండెంట్ జీ జనార్దన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తపాలా కార్యాలయాల్లో అందించే సేవలకు సంబంధించిన ఫిర్యాదులను ఈ నెల 24వ తేదీ, అంతకు ముందే చేరేలా పోస్టు కవర్‌పై డాక్ అదాలత్ అని పెద్ద అక్షరాలతో రాసి పంపాలన్నారు. ఫిర్యాదుదారులు నేరుగా తమ సమస్య పరిష్కారం కోసం 28న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న డాక్ అదాలత్‌కు హాజరు కావచ్చన్నారు. ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఈమెయిల్ ద్వారా సమాచారాన్ని తెలియజేస్తామన్నారు.

ప్రైవేట్ సంస్థల్లో ఉచిత డీఎస్సీ శిక్షణ

కర్నూలు(అర్బన్): ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం ప్రైవేట్ సంస్థలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశామని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జే రంగలక్ష్మీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా జ్ఞానభూమి పోర్టల్‌లో వెబ్ ఆప్షన్‌ను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకు వెయ్యి మందిని షార్ట్ లిస్ట్ చేశారని, వీరంతా వెబ్ ఆప్షన్ సర్వీస్ ద్వారా కోచింగ్ సెంటర్ల ప్రాధాన్యతను ఎన్నుకోవాలన్నారు. ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజన వసతి కూడా కల్పిస్తారని తెలిపారు.

'ఉపాధి'లో బోగస్ మస్టర్లు!

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో రోజుకు లక్ష మందికి ఉపాధి పనులు కల్పించాలనేది లక్ష్యం కాగా.. 64,419 మంది కూలీలు హాజరవుతున్నట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. చాలా చోట్ల 25 నుంచి 30 శాతం వరకు బోగస్ మస్టర్లు వేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రతి రోజూ ఉపాధి పనులకు 64 వేల మందికిపైగా కూలీలు పనులు వస్తున్నట్లు కనబడుతోంది. కొన్ని చోట్ల రాత్రి వేళల్లో యంత్రాలతో పనులు చేయిస్తూ... కూలీలు చేసినట్లుగా మస్టర్ వేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో చాలా మంది వ్యవసాయ కూలీలు, సన్న, చిన్నకారు రైతులు వలసబాట పట్టారు. ఆదోని మండలంలో 4,853, తుగ్గలి మండలంలో 4,176 మంది హాజరైనట్లు లెక్కలు ఉన్నాయి. వెల్దుర్తి మండలంలో 3,816, కోసిగిలో 3,266 మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు.

కూటమి ప్రభుత్వం ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తోంది

- కంపమల్లలో వైసీపీ నాయకులపై దాడి నిందితులను శిక్షించాలి
- డీఐజీని కలిసిన కాటసాని సోదరులు



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి, చిత్రంలో కాటసాని రామిరెడ్డి

కర్నూలు: కూటమి ప్రభుత్వం ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తోందని, ప్రభుత్వం వారిదని టీడీపీ గూండాలు దాడులకు తెగబడటం సరికాదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. కోవెలకుంట్ల మండలం కంపమల్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకేశ్వరరెడ్డి, వారి కుటుంబ సభ్యులపై టీడీపీ గూండాలు ఈనెల 12న దాడి చేసిన ఘటనపై కాటసాని సోదరులు డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్‌ను కలసి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం కర్నూలు బి.క్యాంప్‌లోని కార్యాలయంలో కాటసాని సోదరులు డీఐజీని కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఫ్యాక్షన్ ఉండకూడదనే ఉద్దేశంతోనే దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి తమను రాజీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. అయితే టీడీపీ నాయకులు మళ్లీ ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తున్నారని, ప్రభుత్వం వారిదని రెచ్చిపోతే పరిస్థితులు తిరగబడిన రోజు ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచించుకోవాలని గుర్తు చేశారు. భారత రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో పాలన సాగిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేస్తున్నప్పటికీ పోలీసులు ఏమాత్రం తెలియనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర కమిటీలో ఐదుగురికి చోటు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఐదుగురికి పదవులు దక్కాయి. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మైనార్టీ విభాగం రాష్ట్ర కమిటీలో ముగ్గురిని రాష్ట్ర కార్యదర్శులుగా, ఇద్దరిని రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శులుగా ఎంఏ. సలీమ్, ఎం. ఇమ్రాన్‌ఖాన్, బొగ్గుల అబ్దుల్ గత్తర్, మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా బి. మాబు సాహెబ్, ఎం. అబ్దుల్ వాహిద్‌లను నియమించారు.

క్లుప్తంగా

స్కూటీ దగ్ధం


మంటల్లో కాలిపోతున్న స్కూటీ

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని జాతీయ రహదారిపై ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద ఓ స్కూటీలో మంటలు వ్యాపించి క్షణాల్లో దగ్ధమైంది. బలపనూరుకు చెందిన జవహర్ శుక్రవారం మధ్యాహ్నం సుగాలిమెట్ట వైపు వెళ్తుండగా స్కూటీ నుంచి మంటలు వ్యాపించడంతో అప్రమత్తమై వెంటనే దిగిపోయాడు. అయితే క్షణాల్లో మంటలు చేలరేగి స్కూటీ పూర్తిగా కాలిపోయింది.

మద్యానికి డబ్బులివ్వలేదని ..


మృతి చెందిన రామయ్య

కొలిమిగుండ్ల: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తన భార్య డబ్బులు ఇవ్వక పోవడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం బెలుంలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన మెట్ట చిన్న రామయ్య(30) మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఉదయం మద్యం సేవించేందుకు రూ.500 డబ్బులు ఇవ్వాలని భార్య దాసరి శోభను అడిగాడు. ఆమె డబ్బులు లేవని చెప్పడంతో ఇంట్లో ఉన్న ఫినాయిల్ తాగి అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఎల్లెల్సీలో బాలుడి గల్లంతు


హరికృష్ణ (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణానికి చెందిన ఓ బాలుడు బసాపురం ఎల్లెల్సీ కాలువలో శుక్రవారం గల్లంతయ్యాడు. బోయగేరికి చెందిన శేఖర్ కుమారుడు చిన్నకుమారుడు హరికృష్ణ (16) శుక్రవారం ఇద్దరు స్నేహితులతో కలిసి ఈత కోసం బసాపురంలోని ఎల్లెల్సీ కాలువలో దిగాడు. ముగ్గురు గట్టున ఈత కొడుతుండగా హరికృష్ణ నీటి ఉధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. వెంట వెళ్లిన స్నేహితులు ఇంటికి చేరుకుని విషయం తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన కాల్వ వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడిన తర్వాత కూడా విద్యుత్ దీపాల సహాయంతో గాలిస్తున్నారు. రాత్రి 11 గంటల వరకు కూడా ఆచూకీ లభించలేదు.

కుక్కను తప్పించబోయి..


మృతి చెందిన నరసింహులు (ఫైల్)

నందవరం: గురజాల గ్రామానికి చెందిన కురవ నరసింహులు (47) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నరసింహులు బైక్‌పై గురువారం సాయంత్రం సొంత పనుల నిమిత్తం గురజాల గ్రామం నుంచి నాగలదిన్నెకు బయలుదేరాడు. మార్గమధ్యలో నాగలదిన్నె సమీపంలో కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి బైకు అదుపు తప్పి రోడ్డు పక్కన కాలువలో పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిడి కుమారుడు వీరశేఖర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మృతిడికి భార్య కురవ చంద్రమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.


ఆదోని పట్టణంలో రంగులు చల్లుకుంటున్న యువకులు




ఆదోని మండలం సంతెకూడ్లూరులో రతీ మన్మథులకు పూజలు చేస్తున్న భక్తులు


వెల్దుర్తి మండలం ఎల్ తండాలో కామదహనం సందర్భంగా సంప్రదాయ నృత్యం చేస్తున్న గ్రామస్తులు

ఆనందం హరివిల్లుగా..



హోలీ పండుగ సంబరాలు జిల్లాలో అంబరాన్ని తాకాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకుంటూ ఆనందంలో తడిచిముద్దయ్యారు. ఊరూరా సంతోషాలు హరివిల్లుగా అవిష్కృతమయ్యాయి. వీధుల్లో చిన్నారు లు, యువత కేరింతలు కొడుతూ పండుగ సంబరాలు చేసుకున్నారు. పలు చోట్ల రతీ మన్మథుల వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా అందరూ రంగులు పూసుకుంటూ హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


కర్నూలు మిలటరీ క్యాంటీన్‌లో చిన్నారుల సందడి


కర్నూలు నగరంలో కిసాన్‌ఘాట్‌లో హోలీ సంబరాల్లో పాల్గొన్న యువత


ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

హొళగుందలో వైభవంగా వేడుకలు

హొళగుంద: కామన్న (మన్మథుడు) వేడుకలు శుక్రవారం రాత్రి హొళగుందలో వైభవంగా జరిగాయి. గ్రామంలోని విరక్త మఠం పరిసర ప్రాంతానికి చెందిన యువకులు పలు రకాల హాస్య సన్నివేశాలు ప్రదర్శించి ప్రజలను కడుపుబ్బా నవ్వించారు. రాత్రి మజ్జిగ బండ్లు, ఏనుగు, ఒంటెల ఊరేగింపు నిర్వహించారు. అర్ధరాత్రి కామన్న (మన్మథుడు) దహనం కార్యక్రమం చేపట్టారు. శనివారం కామన్న శవ ఊరేగింపు, నూతన వధూవరుల పెళ్లి ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆనందంగా రంగులు చల్లుకుని హోలీ జరుపుకోనున్నారు.


పౌరాణిక వేషధారణలో చిన్నారులు


మన్మథుడి చిత్రపటం

నాటుసారా నిర్మూలనే నవోదయం 2.0 లక్ష్యం

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు

కర్నూలు: నాటుసారా నిర్మూలనే నవోదయం 2.0 లక్ష్యమని కర్నూలు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు అన్నారు. జిల్లాలో 110 నాటుసారా ప్రభావిత గ్రామాలు ఉండగా.. ఆయా గ్రామాల్లో నాటుసారా నిర్మూలనలో ప్రజలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ఎక్సైజ్ శాఖ ప్రచార రథాన్ని ప్రారంభించింది. స్థానిక కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సుధీర్ బాబు ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. సారా వినియోగం వల్ల కలిగే అనర్థాలు, మానుకుంటే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రచార రథాన్ని ప్రారంభించినట్లు సుధీర్ బాబు తెలిపారు. కర్నూలు పట్టణంలోని సారా ప్రభావిత ప్రాంతాలైన బంగారుపేట, బుధవారపేటలో సాయంత్రం ప్రచార రథం కలియతిరిగింది. కార్యక్రమంలో ఏఈఎస్‌లు రాజశేఖర్ గౌడ్, రామకృష్ణారెడ్డి, సీఐలు చంద్రహాస్, జయరాం నాయుడు, రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐ దుర్గానవీన్ బాబు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


నవోదయ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు

ఆళ్లగడ్డ బస్టాండ్‌లో మహిళా దొంగ అరెస్టు

ఆళ్లగడ్డ: బస్టాండ్‌లలో చోరీలకు పాల్పడుతున్న ఓ మహిళను ఆళ్లగడ్డ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన పద్మావతి అనే మహిళ శుక్రవారం ఆళ్లగడ్డ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉంది. ఆమె పక్కనే కూర్చున్న కడపకు చెందిన ఓ మహిళ పద్మావతి బ్యాగులో ఉన్న పర్సును గమనించింది. క్షణాల్లో దానిని కొట్టేసింది. కొంత సమయానికి పద్మావతి డబ్బులు అవసరముండి బ్యాగులో చూడగా పర్సు కనిపించలేదు. ఎవరో తన పర్సు కొట్టేశారని ఆందోళన చెందుతుండగా తోటి ప్రయాణికులు అక్కడే ఉన్న ఆర్టీసీ కానిస్టేబుల్ ఉపేంద్రకు తెలియజేశారు. అతను వెంటనే బాధితురాలిని విచారించగా తన పక్కన ఇప్పటి వరకు ఓ మహిళ ఉండేదని అనుమానం వ్యక్తం చేశారు. అప్పటికే పర్సు కొట్టేసిన కిలేడీ చెన్నై బస్సు ఎక్కి కూర్చుంది. కానిస్టేబుల్ ఆమెను కిందకు దించి పట్టణ ఎస్ఐ నగీనకు సమాచారం ఇవ్వడంతో ఆమె సంఘటనా స్థలానికి చేరకుని క్షుణ్ణంగా తనిఖీ చేయగా పర్సు కనిపించింది. అందులో బాధిత మహిళకు సంబంధించిన బంగారుకమ్మలు, గొలుసు, కొంత నగదు ఉండగా అప్పగించారు. తర్వాత చోరీకి పాల్పడిన మహిళను పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.


రౌడీషీటర్ సంజన్న దారుణ హత్య

కర్నూలు(టౌన్): శరీన్‌నగర్‌లో రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో సంజన్న(60) అనే వ్యక్తిని ప్రత్యర్థులు మట్టుబెట్టారు. శుక్రవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో సంజన్న శరీన్‌నగర్‌లో ని తన కార్యాలయం వద్ద ఉన్న విషయం తెలుసుకున్న అదే ఏరియాకు చెందిన టీడీపీ సానుభూతి పరుడు వడ్డే అంజి (రామాంజనేయులు) మరికొంత మందితో అక్కడికి చేరుకున్నాడు. అతన్ని బయటకు లాగి కత్తులు, కట్టెలతో దారుణంగా చంపి అక్కడిని నుండి పరారయ్యారు. ఏడాది క్రితం సార్వత్రిక ఎన్నికల ముందు సంజన్న తెలుగుదేశం పార్టీలో చేరాడు. ఆయన కుమారుడు జయరాముడు అదే వార్డు(30వ వార్డు) కార్పొరేటర్. గతంలోనూ ఇదే ఏరియాకు సంజన్న భార్య లక్ష్మీదేవి(సిపిఎం) కార్పొరేటర్‌గా పని చేశారు. మృతునిపై రౌడీషీట్‌తో పాటు పీడీ యాక్ట్ ఉంది. గతంలో వడ్డే అంజితో పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆధిపత్య పోరులో భాగంగానే హత్య జరిగినట్లు స్థానికుల్లో చర్చ జరుగుతోంది. సమాచారం తెలుసుకున్న నాలుగవ పట్టణ పోలీసులు మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబంతో మాట్లాడి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నిర్లక్ష్యానికి మందేది?

- విధి నిర్వహణలో అధికారి వేళాకోలం

గోస్పాడు: నంద్యాల జిల్లా ఔషధ నియంత్రణ అధికారి బాబా ఖలందర్ విధులకు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియక ఎంతో మంది అవస్థలు పడుతున్నారు. తనిఖీలు, ఉన్నతాధికారుల సమావేశాలు.. అంటూ విధుల్లో సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కార్యాలయానికి తరచూ మెడికల్ షాపుల నిర్వాహకులు వారి అవసరాల నిమిత్తం వస్తుంటారు. అయితే కార్యాలయంలో సిబ్బంది అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే విధుల్లో కనిపిస్తారు. రిలీవింగ్ సర్టిఫికెట్ కోసం, ఇప్పటికే ఉన్న మెడికల్ షాపులను ఒకచోటి నుంచి మరొక చోటకు మార్పు కోసం, కొత్తగా షాపు పర్మిషన్ కోసం రోజుల తరబడి తిరగాల్సి వస్తుందని అక్కడికి వచ్చే వారు ఆవేదన చెందుతున్నారు. కింది స్థాయి సిబ్బందిని అడిగితే పనుల నిమిత్తం పెద్దసారు బయటకు వెళ్లారని, సార్ ఎప్పుడు వస్తారు తెలియదని చెబుతుండటం గమనార్హం. జిల్లా కేంద్రంలో ఓ అధికారి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


తలుపులు తెరుచుకోని అధికారి గది

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య


మృతిచెందిన సుప్రియ

కర్నూలు: నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. కల్లూరు మండలం దేవేంద్ర నగర్‌లో నివాసముంటున్న అనురాధ, సుదర్శన్ యాదవ్ దంపతులకు ఇద్దరు కూతుర్లు, కొడుకు సంతానం. చిన్న కూతురు సుప్రియ (19) కర్నూలుకు చెందిన కరీంను ప్రేమించింది. ఈ విషయం తెలిసి ఆమె తండ్రి మదనపడుతుండేవాడు. చివరకు పెళ్లికి అంగీకరించినప్పటికీ తన ప్రేమ విషయంలో తండ్రి మదన పడుతున్న విషయాన్ని గ్రహించి సుప్రియ తీవ్ర మనస్తాంతో ఈనెల 8వ తేదీన పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబ సభ్యులు గుర్తించి ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఈ మేరకు మృతురాలి తల్లి అనురాధ నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోలుకోలేక వైద్య విద్యార్థిని మృతి

కర్నూలు(హాస్పిటల్): వ్యక్తిగత సమస్యలతో గత నెల 14న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కర్నూలు మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థిని రమ్యతేజ ఆసుపత్రిలో కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. అనంతపురం మెడికల్ కాలేజీలో అనెస్తీషియా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ నవీన్‌కుమార్ కుమార్తె కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడవ సంవత్సరం చదువుతోంది. గత నెలలో వ్యక్తిగత కారణాలతో హాస్టల్ గదిలో రసాయన మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అప్పటి నుంచి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిది కోలుకునే పరిస్థితికి వచ్చింది. ఈ నేపథ్యంలో కళాశాలకు వచ్చి 28 నుంచి 3వ తేది వరకు ప్రాక్టికల్ పరీక్షలు కూడా రాసింది. ఆ తర్వాత అనంతపురం వెళ్లి అక్కడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం ఆసుపత్రిలో చేరారు. అయితే మళ్లీ పరిస్థితి విషమించి కోలుకోలేక శుక్రవారం ఉదయం మరణించారు. ఆమె మరణం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, వైద్యులు సంతాపం వ్యక్తం చేశారు.

అలా వసతి గృహంలో..


షటిల్ ఆడుతూ..

స్కూల్‌కు ఒక్క రోజు సెలవు వస్తే చాలు ఇంటి వద్ద పిల్లలు ఇల్లు పీకి పందిరి వేస్తారు. స్మార్ట్ ఫోన్, టీవీని వదలరు. ఆటలు అసలే ఉండవు. కాని హాస్టల్ విద్యార్థులు వేరయ్యా అన్నట్లుగా సెలవు రోజును ఇలా సద్వినియోగం చేసుకున్నారు. శుక్రవారం హోలీ పర్వదినం సందర్భంగా పాఠశాలకు సెలవు ప్రకటించంతో వెల్దుర్తి ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. కొందరు ఆటల్లో నిమగ్నం కాగా.. పదో తరగతి విద్యార్థులు వార్డెన్, ట్యూటర్ పర్యవేక్షణలో చదువుకుంటూ కనిపించారు. ఈ హాస్టల్‌లో 6 నుంచి పదవ తరగతి వరకు 133 మంది విద్యార్థులు ఉన్నారని, స్థానిక బాలుర ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (వార్డెన్) ఉస్మాన్ బాషా తెలిపారు.

– వెల్దుర్తి


వార్డెన్ పర్యవేక్షణలో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులు


చెస్ ఆడుకుంటున్న విద్యార్థులు


క్యారమ్స్ ఆడుకుంటూ..